క్లుప్తంగా

29న జాతీయ లోక్ అదాలత్

మొగల్తూరు: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీన జాతీయ లోక్అదాలత్ నిర్వహించనున్నట్టు తెలియజేసే పత్రాలను పారా లీగల్ వాలంటీర్ డి.వరలక్ష్మి, తహసీల్దార్ భాస్కర్, ఎస్సై కె.వెంకటరమణకు సోమవారం అందజేశారు. నరసాపురం మండల న్యాయ సేవాధికార కమిటీ ఆదేశాల మేరకు అధికారులకు అవగాహన పత్రాలను అందిస్తున్నామని ఆమె తెలిపారు. రాజీపడదగిన సివిల్, క్రిమినల్, ప్రీలిటిగేషన్ కేసులను జాతీయ లోక్ అదాలత్లో ఇరుపార్టీ లు అంగీకారమైన సత్వరమే పరిష్కారం పొందవచ్చున్నారు. ఈనెల 29న నరసాపురంలోని అన్ని కోర్టుల్లో లోక్ అదాలత్ నిర్వహస్తారని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పముజుల సుచరితకు చేనేత సంఘం నివాళి



సుచరితకు నివాళులర్పిస్తున్న చేనేత సంఘాల సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: చీరాల వద్ద చీపురుపాలెం గ్రామంలో శుక్రవారం చేనేత సామాజిక వర్గానికి చెందిన పముజుల సుచరితపై జరిగిన హత్యాచారం, హత్య ఘటనను పట్టణ చేనేత కులాల సంఘ సభ్యులు తీవ్రంగా ఖండించారు. సోమవారం స్థానిక గాంధీబొమ్మల సెంటర్ వద్ద రాత్రి 8 గంటల సమయంలో చేనేత కులాల సంఘం ఆధ్వర్యంలో సుచరిత మృతిపట్ల కొవ్వొత్తుల ప్రదర్శన చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు వట్టం గణేశ్వరరావు మాట్లాడుతూ ఇంత దారుణానికి వడిగట్టిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆ కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షలు అందజేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు నీలంశెట్టి ప్రసాద్, మానెం బసవరాజు, యర్రా శివాజీ, శాగా రాంబాబు, బాసిన సత్యనారాయణ, బి.చంద్రశేఖర్, యు.రాజేశ్వరి, ఎ.నాగేశ్వరరావు, ఆర్ భాస్కర రావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఖరీఫ్ నారుమడులు

పాలకోడేరు: మండలంలో సుమారు 11,500 ఎకరాలలో రైతులు వరి సాగు చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి వి.నారాయణరావు తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్కు సుమారుగా 30 శాతం నారుమడులు వేసినట్లు తెలిపారు. ముఖ్యంగా ఈ ఖరీఫ్ సీజన్ కి సంబంధించి ఎక్కువగా రైతులు నూజివీడు కంపెనీ సంపత్ స్వర్ణ, మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానంలోని ఎంటీయూ 1061 రకాల విత్తనాలను ఎంపిక చేసుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రైతు సోదరులంతా విత్తన శుద్ధి చేసుకోవాలని, దీని వల్ల చీడ పీడల నుంచి నారు మడులను రక్షించుకోవచ్చునని తెలిపారు.

దాడి ఘటనపై కేసు

ఉండి: భార్యను కాపురానికి పంపడం లేదంటూ భార్య, బావపై దాడి చేసిన ఘటనలో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం బీసీ కాలనీకి చెందిన కరణం భవానీ (దివ్యాంగురాలు, మూగ)కి ఉండికి చెందిన పొంగిలి ప్రసాద్కు ఏమిదేళ్ల క్రితం వివాహమయ్యింది. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే ఇటీవల భవానీని ఆమె భర్త కించపరుస్తూ అవమానకరంగా మాట్లాడుతుండటంతో ఆమె నెల రోజుల క్రితం పుట్టింటికి వచ్చేసింది. అయితే సుమారు రెండు రోజుల క్రితం ప్రసాద్ తన భార్యను కాపురానికి పంపాలంటూ పొగిలి దుర్గాప్రసాద్, లలిత, దాసరి దుర్గాదేవి, సాయి కుమారి అనే వారితో కలిసి వెళ్లి తన భార్యను కాపురానికి పంపించాలంటూ ప్రసాద్తో వారంతా గొడవకు దిగారు. ఈ గొడవలో భవానిపైనా ఆమె అన్న కరణం గోవింద్పైనా దాడి చేసి కొట్టారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్సై ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భూ ఆక్రమణపై ఫిర్యాదు

ఆకివీడు: గ్రీవెన్స్ సెల్ కార్యక్రమంలో ఒక ఫిర్యాదు అందినట్లు ఎంపీడీవో రాధాకృష్ణ సోమవారం తెలిపారు. స్థానిక ధర్మాపుర రెవెన్యూ గ్రామంలో 1.31 ఎకరాల భూమిలో 20 సెంట్లు ఆక్రమణకు గురయ్యిందని స్థానిక నివాసి కోళ్లపర్తి సుబ్రహ్మణ్య దత్తు గ్రీవెన్స్ సెల్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తన భూమిని సర్వే చేయించి, హద్దులు నిర్ణయించవలసినదిగా కోరారు. ఫిర్యాదును సంబంధిత అధికారికి పంపిస్తున్నట్లు తెలిపారు.

బహిరంగ వేలం ఆదాయం రూ.68 వేలు

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని రెండు మంచినీటి చెరువుల్లో ఒక రోజు చేపలు పట్టుకునేందుకు సోమవారం బహిరంగ వేలంలో రూ.68 వేలు ఆదాయం వచ్చింది. స్థానిక భుజబలరాయుడు చెరువులో చేపలు పట్టుకునేందుకు వల్లభుని నాగరాజు రూ.28 వేలకు, మంచినీటి చెరువులో చేపలు పట్టుకునేందుకు వనమాలి కృష్ణ భగవాన్ రూ.40 వేలకు వేలం దక్కించుకున్నారు. చెరువుల్లోని చేపలను ఒక రోజు పట్టుకునే విధంగా వెంటనే సమాయత్తమవ్వాలని కమిషనర్ జీవీ కృష్ణమోహన్ సూచించారు. బహిరంగ వేలాన్ని నగర పంచాయతీ మేనేజర్ వెంకటేశ్వరరావు నిర్వహించారు.

నారుమడి పనుల్లో రైతులు బిజీబిజీ

- విత్తన ఎంపికే కీలకమంటున్న అధికారులు
- యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



యలమంచిలి మండలంలో వేసిన నారుమడులు



ఎం శామ్యూల్ జాన్సన్, మండల అగ్రికల్చరల్ ఆఫీసర్, పాలకొల్లు

పాలకొల్లు సెంట్రల్: సార్వా నారుమడులు వేసే పనుల్లో రైతులు బిజీ అయ్యారు. నాణ్యమైన విత్తనం ఎంపికే కీలకమని వ్యవసాయ శాఖ అధికారుల సూచిస్తున్నారు. సరైన సమయంలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే కోతల సమయంలో అధిక దిగుబడులు సాధించవచ్చని చెబుతున్నారు. పాలకొల్లు నియోజకవర్గంలో మండలాల వారీగా పాలకొల్లులో 9,000, యలమంచిలిలో 10,000, పోడూరులో 7,000 ఎకరాల్లో సార్వా వరి సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు నారుమడులు పోసే ప్రక్రియ 40 శాతం పూర్తికాగా, మిగిలిన ప్రక్రియ మరోవారం రోజుల్లో పూర్తవుతుందని అధికారులు అంచనాలు వేస్తున్నారు. ముఖ్యంగా ఈ ఖరీఫ్లో ఎంటీయూ 7029 (స్వర్ణ), పీఎల్ఏ 1100, ఎంటీయూ 1318, ఎంటీయూ 1061, 1064, 1153,1156, 1121 వంటి వరి వంగడాలను సాగు చేస్తున్నారు. కాలువల్లో నీరు వదిలినా ఇంకా శివారు ప్రాంతాలకు నీరు చేరకపోవడంతో వరుణుడిపై ఆధారపడి రైతులు నారుమడులు వేస్తున్నారు.

నారుమడి తయారీ ఇలా..

నారుమడులు, నాట్లు వేసేందుకు చేలను సిద్ధం చేసే ప్రక్రియపై పాలకొల్లు మండల అగ్రికల్చరల్ ఆఫీసర్ ఎం శామ్యూల్ జాన్సన్ రైతులకు పలు సూచనలు చేశారు. ముందుగా 10 నుంచి 12 రోజుల వ్యవధిలో పొలాన్ని మూడు దఫాలుగా దమ్ము చేసి చదును చేయాలి. నీరు పెట్టడానికి తీయడానికి అనుకూలంగా ఏర్పాటుచేసుకోవాలి. ఐదు సెంట్ల నారుమడికి రెండు కిలోల నత్రజని వేయాలి. ఇది విత్తనం చల్లేముందు ఒక కిలో, విత్తిన 12 నుంచి 14 రోజుల్లో మరో కిలో నత్రజని చల్లాలి. ఒక కిలో భాస్వరం, కిలో పొటాష్ నిచ్చే ఎరువులను దుక్కిలో వేయాలి. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భాస్వరం రెట్టింపు వేయాల్సి ఉంటుంది. శిలీంద్ర నాశనితో శుద్ధిచేసి మొలకకట్టిన విత్తనాన్ని సెంటుకు ఐదు కిలోల చొప్పున చల్లుకోవాలి. నారు ఆకు పూర్తిగా పురివిచ్చుకునే వరకు ఆరు తడులు ఇచ్చి అనంతరం నీరు పలుచగా ఉండేలా నిల్వ చేసుకోవాలి. జింకు లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి రెండు గ్రాములు జింకు సర్ఫేటు ద్రావణాన్ని పిచికారీ చేయాలి. విత్తిన 10 రోజులకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు సెంటు నారుమడికి 160 గ్రాములు చొప్పున వేయాలి లేదా క్లోరిఫైరిపాస్ 2.0 మిల్లీ లీటర్లు నీటికి కలిపి విత్తన పది రోజులకు, 17 రోజులకు పిచికారీ చేయాలి. ఇంకా రైతులకు పంటలపై సలహాలు సూచనలు అవసరమైతే.. పరిష్కరించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు నిత్యం అందుబాటులో ఉంటున్నారు.

నాట్లు వేయడానికి సన్నద్ధం

నాట్లు వేయడానికి పొలం అంతా సమానంగా ఉండేలా చదును చేసుకోవాలి. దీంతో నారు తీసే సమయంలో మొక్కలు లేతగా ఉండడం వల్ల మూన వేగంగా తిరుగుతుంది. నాలుగు నుంచి ఆరు ఆకులున్న లేత నారును మాత్రమే వేయాలి. ముదిరిన నారును నాటితే దిగుబడి తగ్గుతుంది. నాట్లు పైపైన నాటితే పిలకలు ఎక్కువగా తొడిగే అవకాశం ఉంటుంది. నాట్లు వేసే సమయంలో భూసారాన్ని బట్టి ఖరీఫ్లో చదరపు మీటరుకు 33 మూనలు ఉండేలా చూసుకోవాలి. బాగా మెత్తగా, బరువైన నేలల్లో దమ్ము చేసిన రెండు నుంచి పది రోజుల్లోపే నాట్లు వేయాలి. నాటిన అనంతరం ప్రతి రెండు మీటర్లకు 30 సెంటీమీటర్ల చొప్పున బాటలు తీయాలి. దీని వల్ల పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి తెగుళ్లను అదుపుచేసుకోవచ్చు. ఎరువులు, పురుగు మందులు, కలుపు మందులు వేయడానికి పైరు పరిస్థితిని గమనించడానికి ఈబాటలు దోహదపడతాయి.

శివాలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో శివలింగం

పాలకొల్లు అర్బన్: వాయుత్రిలింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శివదేవునిచిక్కాలలో పార్వతీ సమేత శివదేవస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతీ అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. సంతాన ప్రాప్తి కోసం కొత్తదంపతులు స్వామివారికి అభిషేకం చేసి ఆలయ ఆవరణలో కొబ్బరి మొక్కలు నాటారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకస్వామి ర్యాలి శివాజీ, ఈఓ నామాల రంగరాజన్ భక్తులకు సేవలందించారు.

యథేచ్ఛగా పాలిథిన్ కవర్ల వినియోగం

యలమంచిలి: పాలిథిన్ కవర్లు వాడకం వల్ల అనేక దుష్పరిమాణాలు ఏర్పడుతున్నా.. వాటిని అరికట్టడంలో అధికారులు విఫలమవుతునే ఉన్నారు. ఏటా పాలిథిన్ కవర్ల వినియోగం పెరుగుతుండటంతో పర్యావరణ ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. పాలిథిన్ కవర్ల వినియోగంపై నిషేధం ఉన్నా అధికారుల ఉదాసీనత వల్ల మార్కెట్లో కవర్లు యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. వీటి వాడకం ఏ స్థాయికి చేరిందంటే టీ సెంటర్లలో టీ, కాఫీ హోటల్స్, కూరల విక్రయాల కేంద్రాల్లో సాంబారు వంటి వేడి వేడి ద్రవపదార్థాలు సైతం పలుచటి పాలిథిన్ కవర్లలో ప్యాక్ చేసి అమ్ముతున్నారు. జ్యూస్ సెంటర్లలో కూడా అతి చల్లని జ్యూస్లను పాలిథిన్ కవర్లలో ప్యాక్ చేసి ఇస్తున్నారు. అతి చల్లని, అతి వేడి పదార్థాలు పలుచటి పాలిథిన్ కవర్లలో వేయడం వల్ల ప్లాస్టిక్ కరిగి ఆహార పదార్థాలలో చేరుతుంది. వాటిని సేవించడం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక రోగాలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని వైద్యులు హెచ్చరిస్తున్న ఎవరూ పట్టించుకోవడం లేదు.

ఉదాసీనత

దశాబ్ద కాలం క్రితం పాలిథిన్ కవర్ల వాడకంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధం విధించాయి. ఆ సమయంలో అధికారులు దాడులు చేసి పట్టుకుని అపరాధం రుసుం విధించేవారు. దీంతో యజమానులు తమ దుకాణాల వద్ద పాలిథిన్ కవర్లు ఇవ్వబడవు అనే బోర్డు పెట్టేవారు. అదే సమయంలో అనేక స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు గుడ్డ సంచులు పంపిణీ చేశాయి. కాలక్రమేణ అటు అధికారుల్లో, ఇటు దుకాణాల యజమానుల్లో ఉదాసీన రావడంతో పాలిథిన్ కవర్ల వినియోగం పూర్వస్థితికి చేరింది.

ఆరోగ్యానికి, పర్యావరణానికి ముప్పు

పాలిథిన్ కవర్ల వినియోగం వల్ల మానవుల ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా పర్యావరణమూ దెబ్బతింటుంది. పాలిథిన్ మితిమీరి వాడడం వల్ల వాటి మలినాలు మానవ శరీరంలో చేరి అనేక ప్రాణాంతక రోగాలకు దారితీస్తాయి. ఆహార పదార్థాలు తిని పాడేసిన కవర్ల నుంచి వచ్చే వాసనను పసిగట్టి ఆవులు, గేదెలు, కుక్కలు వంటి జంతువులు కవర్లతో వాటిని తింటున్నాయి. దీంతో వాటికి జీర్ణకోశ వ్యాధులు వచ్చి ప్రాణాలు కోల్పోతున్నాయి. వాడి పడేసిన పాలిథిన్ కవర్లు మట్టిలో కరగకపోవడం వల్ల పర్యావరణం దెబ్బతింటుంది.



పాలిథిన్ కవర్లో వేడి వేడి టీ వేస్తున్న విక్రయదారుడు



పాలిథిన్ కవర్లో ప్యాక్ చేసిన వేడి సాంబారు

తాగునీరు అందించాలి



పెనుగొండ సచివాలయంలో వినతి పత్రం అందిస్తున్న నాయకులు

పెనుగొండ: కోడి పందేల దిబ్బ ప్రజలకు సత్వరం తాగునీటి అందించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్ వెంకటేశ్వరరావు కోరారు. ఈ మేరకు సోమవారం పెనుగొండ గ్రామ సచివాలయంలో కోడి పందేల దిబ్బవాసులతో కలిసి వినతిపత్రం అందజేశారు. 2008లో 1130 కుటుంబాలకు ఇంటి స్థలాలు ఇవ్వడంతో 600లకు పైగా ఇళ్లు నిర్మించుకొన్నారని తెలిపారు. అప్పటి నుంచి తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేశారని తెలిపారు. ఇప్పుడు నీటి సరఫరా నిలిచిపోవడంతో అధికార్లకు ఎన్నిసార్లు విన్నవించుకొన్నా పట్టించుకోవడం లేదన్నారు. తక్షణం తాగునీటిని అందించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మాదాసు నాగేశ్వరరావు, షేక్ పాదుషా, గుడల వాణి, జక్కంశెట్టి సాయిలు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్లను సద్వినియోగం చేసుకోండి

మొగల్తూరు: స్టూడెంట్ కిట్స్ను ప్రతి విద్యార్థీ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ సూచించారు. స్థానిక పెన్మత్స రంగరాజు ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సుమారు 400 మందికి నోటు, పాఠ్య పుస్తకాలు, బెల్టులు, సాక్స్, బ్యాగ్లను ఆయన పంపిణీ చేశారు. నాయకర్ మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదివిన రెబల్ స్టార్ కృష్ణంరాజు, మెగాస్టార్ చిరంజీవిలతో పాటు ఎంతో మంది శాస్త్రవేత్తలుగా, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ఉన్నతాధికారులుగా రాణిస్తుండడం అభినందనీయమన్నారు. వీరి స్థాయికి నేటి విద్యార్థులకు చేరుకోవాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ పడవల మేరీ సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యులు తిరుమాని బాపూజీ, వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు, ఉపసర్పంచ్ బోనం నర్సింహరావు, ఎంపీటీసీ సభ్యులు దూసనపూడి జ్యోతి మహేశ్వరి, ఎన్నాబత్తుల ఉషారాణి, కుక్కల సుశీల, మోకా మహాలక్ష్మి, అందే ముక్తేశ్వరరావు, పట్టా రజనీ కుమారి, ప్రధానోపాధ్యాయులు వి రవి శంకర్ సర్కార్ తదితరులు పాల్గొన్నారు.



కిట్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాయకర్

విద్యాసామగ్రి పంపిణీ

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మునిసిపల్ కమిషనర్ విజయసారధి ఆకాంక్షించారు. సోమవారం స్థానిక ఎస్కేపీ అండ్ టీవీఆర్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం, బూట్లు పంపిణీ చేశారు. ఎంఈఓ గుమ్మళ్ల వీరాస్వామి, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కర్నేన రోజారమణి, మాజీ కౌన్సిలర్ జీవీ, శిడగం సూరి, చీరా సత్తిబాబు, మీరాల రాము తదితరులు పాల్గొన్నారు.

28న కౌన్సిల్ సమావేశం

నరసాపురం: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 28వతేదీ శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఏర్పాటు చేనున్నట్టు మున్సిపల్ చైర్పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ తెలిపారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో జరిగే ఈ సమావేశానికి సభ్యులు విధిగా హాజరుకావాలని కోరారు. అజండాలోని అంశాలు, వార్డుల్లో నెలకొన్న సమస్యలపైనా చర్చిస్తామని పేర్కొన్నారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస దొర

పెనుగొండ: గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, అంటువ్యాధులపై పంచాయతీల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ ఎస్ శ్రీనివాస దొర అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన సర్పంచ్లు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎస్ఎం, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమవేశం నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాలు, అధిక వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితులలో వినియోగించుకోవడానికి నాణ్యమైన బ్లీచింగ్, సున్నం, ఫినాయల్, మొలాథియన్, ఎటేట్ సోడియం హైపోక్లోరైడ్, తాగునీటిని క్లోరినేషన్ నిమిత్తం క్లోరిన్ టాబ్లెట్స్ సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అందుబాటులో పొక్లెయిన్ ఉంచుకోవాలన్నారు. గృహ అవసరాలకు సరఫరా చేసే తాగునీరు క్లోరిన్ పరిమాణం 0.2 నుంచి 0.3 ఉండాలని అన్నారు. విద్యుత్ సరఫరా నిలిచినపుడు తాగునీరు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు. తుఫానులు, వరదలు సమయంలో దిగువ ఏరియాల ప్రజలను రక్షిత ప్రదేశాలు, సైక్లోన్ సెంటర్ల ఉంచడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లను వరదల నుంచి కాపాడేందుకు సురక్షితంగా ఉంచడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఈవోపీఆర్డీ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ మిరియాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దాళ్వా ధాన్యం సొమ్ము కోసం ఎదురుచూపు

- సార్వా సాగు పెట్టుబడులకు ఇబ్బందులు
- అధికారులకు రైతుల వినతులు

పోడూరు: దాళ్వా పంట ధాన్యం సొమ్ము కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. సార్వా పెట్టుబడులకు చేతిలో చిల్లిగవ్వలేక సాగుచేయడం ఆలస్యమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువుల షాపుల్లో బాకీలు తీర్చలేకపోవడంతో యజమానులు ఎరువులు ఇవ్వడం లేదని, క్రాప్లోన్లు చెల్లించకపోవడంతో బ్యాంకుల్లో కొత్తలోన్లు ఇవ్వడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యం బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కవిటం గ్రామ రైతులు కోరుతున్నారు. ఈ మేరకు వారు సోమవారం పోడూరు తహసీల్దార్ బీవీవీ మురళీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కవిటం గ్రామంలో రైతులకు ధాన్యం బకాయిలు దాదాపుగా రూ.9 కోట్లు అందాల్సి ఉందని పేర్కొన్నారు.

సార్వాకు సాగునీటి ఎద్దడి

సార్వా నారుమడులు నీరు అందక ఎండిపోతున్నాయి. కవిటం ఆయకట్టు పొలాలకు నరసాపురం ప్రధాన కాలువ నుంచి జిన్నూరు చానల్, మట్టపర్రు కాలువ, నంబర్-2 ఓల్డ్ చానల్, నంబర్-6 చానల్తో పాటు 5 డీపీల ద్వారా సాగు నీరందాలి. అయితే నరసాపురం ప్రధాన కాలువలో కవిటం లాకుల వద్ద నీటిమట్టం 3.3 అడుగులు మాత్రమే ఉండడంతో పైన తెలిపిన పంటకాలువలకు, బోదెలకు నీరు రావడం లేదు. కవిటం లాకుల వద్ద కనీసం ఐదు అడుగుల నీటిమట్టం ఉంటేనే ఆయా పంట కాలువలకు నీరు అందుతుంది. సాగు నీటి సమస్యను తహసీల్దార్ మురళీకృష్ణ దృష్టికి రైతులు మండ వెంకటరెడ్డి, మేడపాటి రఘురామరెడ్డి, మేడపాటి కుమార్రెడ్డి, గంగిరెడ్డి, జి.శ్రీనివాసరావు, మేడపాటి లక్ష్మణరెడ్డి, బొక్కా బాబూరావు, వీరవల్లి సుబ్బారావు, నందికోళ్ల వెంకటరత్నం తదితరులు తీసుకెళ్లారు. ధాన్యం బకాయిలు, సాగునీటి సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చినట్టు రైతులు తెలిపారు.



పోడూరులో ధాన్యం సొమ్ము చెల్లించాలని తహసీల్దార్కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

కొత్త రుణాలు ఇవ్వడం లేదు



నేను సొంతపొలం, కౌలుపొలం కలిపి మొత్తం 22 ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నాను. నాకు దాదాపు రూ.11 లక్షలు ధాన్యం డబ్బులు రావాలి. ధాన్యం అమ్మి రెండు నెలలు అవుతున్నా సొమ్ము అందకపోవడంతో చాలా అవస్థలు పడుతున్నాం. క్రాప్లోన్ బకాయిలు చెల్లించలేకపోవడంతో బ్యాంకుల్లో కొత్తలోన్లు కూడా ఇవ్వడం లేదు.

– మండ వెంకటరెడ్డి, రైతు

దమ్ములకూ డబ్బులు లేవు



నేను ఆరు ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నాను. నాకు ఐదున్నర లక్షల రూపాయల వరకు ధాన్యం బకాయిలు రావాలి. దమ్ములు చేయడానికి, విత్తనాలకు కూడా చేతిలో డబ్బులు లేక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాను. ప్రభుత్వం వెంటనే స్పందించి, యుద్ధప్రాతిపదికన రైతులకు బకాయిలు చెల్లించాలి.

– మేడపాటి రఘురామరెడ్డి, రైతు

ఎండుతున్న నారుమడులు



సార్వా నారుమడులకు సాగునీరు అందక ఎండిపోతున్నాయి. కవిటం లాకుల వద్ద ప్రధాన కాలువలో ఐదడుగుల నీటిమట్టం ఉంటేనే గ్రామంలో పంటచేలకు నీరందుతుంది. కాలువలో నీరు మూడు అడుగులే ఉండడంతో చేలకు నీరందడం లేదు. ఇరిగేషన్ అధికారులు స్పందించి సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి.

– మేడపాటి కుమార్రెడ్డి, రైతు

ధాన్యం సొమ్ము వెంటనే చెల్లించాలి



సబ్కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

నరసాపురం: ప్రభుత్వం ధాన్యం సొమ్ము వెంటనే చెల్లించాలని ఏపీ కౌలు రైతుల సంఘం డిమాండ్ చేసింది. సోమవారం సంఘం ఆధ్వర్యంలో నరసాపురం సబ్కలెక్టర్ కార్యాలయం వద్ద రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కవురు పెద్దిరాజు మాట్లాడుతూ జిల్లాలో దాళ్వాపంట మసూలై, రైతులు ధాన్యం అమ్మి రెండు నెలలు కావస్తున్నా ప్రభుత్వం ఇంత వరకూ రైతులకు ధాన్యం సొమ్ము చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పడ కూటమి ప్రభుత్వం ఈ అంశంపై ఇంతవరకూ ప్రకటన చేయలేదని వాపోయారు. మరోవైపు సార్వా సాగు పెట్టుబడికి రైతులు అప్పులుకోసం పరుగులు పెడుతున్నారని తెలిపారు. జిల్లాలో 70 వేల మంది రైతులకు రూ.1000 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. ఈ మేరకు ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కటకంశెట్టి మాణిక్యాలరావు, కవురు శ్రీనివాస్, జల్లి రామ్మోహన్రావు పాల్గొన్నారు.

పాఠశాలకు గ్యాస్ స్టవ్ బహూకరణ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక జీవీఎస్వీఆర్ మునిసిపల్ ప్రాథమిక పాఠశాలకు దాతలు గ్యాస్ స్టవ్, కుర్చీలను బహూకరించారు. సోమవారం దాతలు గాదె సుబ్బారావు రూ.4 వేలు విలువ చేసే గ్యాస్ స్టవ్, మజ్జి శంకరం కుర్చీలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీ ప్రసాద్కు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థులకు దాతల సహకారం ఎంతగానో దోహదపడుతుందని భవానీప్రసాద్ అన్నారు. ప్రభుత్వంతో పాటు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యశించాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దనాని సూర్యప్రకాష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

28న ఉచిత మెగా వైద్యశిబిరం

పోడూరు: న్యూలైఫ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పండితవిల్లూరులోని ఐపీసీ చర్చిలో ఏలూరు ఆశ్రం ఆసుపత్రి వారిచే ఈ నెల 28న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు మినిస్ట్రీస్ డైరెక్టర్, చర్చి పాస్టర్ జి.సామ్యేల్జాన్సన్ ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ వ్యాధులతో పాటు కార్డియాలజీ, ఎముకలు, చెవి, ముక్కు, గొంతు, క్షయ, ఊపిరితిత్తులు, స్త్రీల విభాగానికి సంబధించిన వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. ఉదయం 9 నుంచి, మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగే ఈ శిబిరాన్ని పండితవిల్లూరు గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యక్తిపై దాడి

యలమంచిలి: మండలంలోని ఏనుగువానిలంక గ్రామానికి చెందిన ఇనుకొండ మాణిక్యాలుపై అదే గ్రామానికి చెందిన రావూరి పుల్లారావు ఇటుకతో దాడిచేసి గాయపరిచారు. సోమవారం రోడ్డుపై నడచివెళుతున్న మాణిక్యాలుని పుల్లారావు దుర్భాషలాడారు. అదేమిటని ప్రశ్నించినందుకు ఇటుకతో మాణిక్యాలపై దాడిచేయడంతో తలకు గాయాలయ్యాయి. దీంతో మాణిక్యాలు పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో వైద్యం చేయించుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై కాకి శివన్నారాయణ కేసు నమోదు చేశారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

పెనుగొండ: ఈపురుపాలెంలో చేనేత కుటుంబానికి చెందిన చిన్నారి సుముజుల సుచరితపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ జిల్లా అధ్యక్షుడు అల్లాడ సూర్యభాస్కర్రావు సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం సరైన ప్రణాళికతో ముందుకెళ్లి భద్రత కల్పించాలని కోరారు.

తాళ్లూరి ఇందిర మృతి



తాళ్లూరి ఇందిర (ఫైల్)

నరసాపురం: పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత తాళ్లూరి ఇందిర (72) అనారోగ్యంతో హైదరాబాద్లో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందారు. రాష్ట్ర విభజనకు ముందు వరకు ఆమె కాంగ్రెస్పార్టీలో చురుగ్గా పనిచేశారు. కాంగ్రెస్ పట్టణ మహిళా అధ్యక్షురాలిగా కూడా పని చేశారు. ఇందిర మృతికి మాజీ ప్రభుత్వ చీఫ్విప్ ముదునూరి ప్రసాదరాజు, వైఎస్సార్ సీపీ కేంద్రపాలక మండలి సభ్యుడు పీడీరాజు, వైఎస్సార్ సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కామన బుజ్జి సంతాపం తెలిపారు.